# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు — తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY



## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954



పబ్లిషర్: హైదరాబాద్ సంపుటి : 1 సంచిక : 26 శుక్రవారం 06- 9-2024 పేజీలు : 4 వెల రూ.- 3


## మన ఊరు-మన బడి'ని మధ్యలోనే ఆపేసిన ప్రభుత్వం

విద్యావ్యవస్థల మరింత బలోపేతం కావాలి

గురుపూజోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే హరీష్ రావు


2లో

## ఎలక్ట్రిక్ వాహనాలకు ఇక రాయితీ చెల్లు

డిమాండ్ పెరగడంతో సబ్సిడీలు అవసరం లేదు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



వివరాలు 2లో

# ప్రపంచగతిని మార్చేస్తున్న సరికొత్త ఆవిష్కరణలు

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ప్రపంచమే మారుతోంది

కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో పెను మార్పులు

ఎఐతో సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం

'గ్లోబల్ ఏఐ' సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి పిలుపు




హైదరాబాద్,సెప్టెంబర్5 **మనవెలుగు** సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ అని కొనియాడారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయి. అవి ఆశలతో పాటు భయాన్నీ తీసుకొస్తాయి. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశాం. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆవిష్కరణలకు పారిశ్రామిక

మిగతా 2లో

# ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానికత

స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులే

హైకోర్టులో విచారణ...తీర్పు వెలువరించిన ధర్మాసనం




హైదరాబాద్,సెప్టెంబర్5 **మనవెలుగు** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి స్థానికత వివాదంపై పూర్తిస్థాయి వాదనలను విన్న హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. కాళోజీ నారాయణరావు వైద్య యూనివర్సిటీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఆదేశించింది.మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను సవరిస్తూ రూల్ '3ఏ'ను చేరుస్తూ ప్రభుత్వం జీవో 33ను జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

మిగతా 2లో

# కెనాల్స్, చెరువుల పునరుద్దరణ

తక్షణం టెండర్లు పిలవండి

అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్



మహబూబాబాద్,సెప్టెంబర్5 **మనవెలుగు** భారీ వర్షాలకు తెగిపోయిన చెరువుకట్టలు, కెనాల్స్ పునరుద్ధరణకు వారం రోజుల్లో టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సంభవించిన వర్షపు ఉధృతికి జరిగిన నష్టంపై గురువారం నాడు నీటిపారుదల శాఖాధి కారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా చెరువులు, కాలువల పునరుద్ధరణతో పాటు

మిగతా 2లో

# విద్యారంగ అభివృద్దికి అధిక ప్రాధాన్యం

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ జివో విడుదల

ఉపాధ్యాయ దినోత్సవంలో డిప్యూటి సిఎం భట్టి



హైదరాబాద్,సెప్టెంబర్5 **మనవెలుగు** విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు తగ్గట్లుగా నిర్ణయాలు కూడా తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అలాగే విద్య నేర్పుతున్న గురువులకు ఈ ప్రభుత్వం అంతే ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవీంద్ర భారతిలో గురు పూజోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 27,862 ప్రభుత్వ

మిగతా 2లో

## సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

వారి ప్రోత్సాహంతోనే ఇంతటి వారం అయ్యాం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



వివరాలు 2లో

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు  తెలుగు దినపత్రిక
శుక్రవారం 6 సెప్టెంబర్2024

# కెనాల్స్, చెరువుల పునరుద్ధరణ

(మొదటి పేజి (తరువాయి)

పాక్షికంగా దెబ్బతిన్న చెరువులు, కాలువల మరమ్మతులకు కూడా టెండర్ల ప‌క్రియను తక్షణమే పూర్తి చేయాలన్నారు. వెంటనే పాలనాపరమైన అనుమతులు తీసుకుని శుక్రవారం ఉదయానికి ఆన్‌లైన్‌లో టెండర్లు అప్‌డేట్ చెయ్యాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇంతటి వర్షపు ఉధృతిలోనూ విధుల్లో నిమగ్నమయి పనిచేసిన నీటిపారుదల శాఖా సిబ్బందిని ఆయన అభినందించారు. అయితే అదే సమయంలో తాను స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు కొన్ని వాస్తవాలు వెలుగు చుశాయన్నారు. రెగ్యులేటరీలు, షట్టర్లు పనిచేస్తున్నాయా లేదా అన్న పరిశీలన కనిపించలేదన్నారు. తద్వారా విపత్తులు సంభవించినప్పుడు దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఒక దగ్గర రెగ్యులేటరీ జామ్ అయ్యిందన్నారు. మరోచోట షట్లర్ ఎత్తుతుంటే తెగిపోయిందన్నారు. ఈ తరహా సంఘటనలు మరోసారి పునరావృతం అయితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే అందుకు సీఈలే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, హరేరాం, శంకర్.. నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా దాస్ నాథ్, డిప్యూటీ ఈఎన్‌సీ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖా చీఫ్ ఇంజినీర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



హనుమకొండ,సెప్టెంబర్5 సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె. ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటే గురువులు ఎంతో సంతోషపడతారని పేర్కొన్నారు. ప్రతి విజేత కూడా తన విజయానికి కారణం గురువులే అని చెబుతుంటారని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేది ఉపాధ్యాయులేనని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను మరింత మెరుగు పరిచే విధంగా గురువులు తోడ్పాటునందించి ఉన్నత స్థాయికి చేరడంలో కృషి చేస్తారన్నారు. కరోనా సమయంలో పిల్లలకు మొబైల్ ఫోన్లను ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యార్థులను సమగ్ర మూర్తిమత్వంతో గురువులు తీర్చిదిద్దా లన్నారు. ఈ సందర్భంగా గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నవారికి అభినందనలు తెలియజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉపాధ్యాయుల సహకారం కూడా ఎంత ఉందన్నారు. రాబోయే రోజులలో కొత్త వరంగల్ ను చూడబోతున్నారని తెలిపారు. కొత్త వరంగల్ ను చూడడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించు కున్నామని పేర్కొన్నారు.

## ఎలక్ట్రిక్ వాహనాలకు ఇక రాయితీ చెల్లు

న్యూఢిల్లీ,సెప్టెంబర్5 దేశంలో త్వరలో ఈవీల రేట్లు పెరిగే అవకాశం ఉంది. దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాలకు ఇకపై ప్రభుత్వ రాయితీలు అవసరం లేదని తాజాగా భారత రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వీటికి డిమాండ్ పెరగడం, ఉత్పత్తి ఖర్చులు తగ్గడం వల్ల ఇకపై సబ్సిడీ అవసరం లేదన్నారు. ఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బెర్గ్ సమ్మిట్‌లో గడ్కరీ ఈ మేరకు పేర్కొన్నారు. ప్రారంభ వ్యయం ఎక్కువగా ఉందని, అయితే డిమాండ్ పెరగడంతో ఉత్పత్తి ఖర్చులు తగ్గాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలు ఇప్పటికే అనుకూలమైన పన్నును అనుభవిస్తున్నాయని, ఇ÷ఎలపై ఉ÷ు కేవలం 5శాతం మాత్రమే ఉందన్నారు. ఇది పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే చాలా ఎక్కువ ప్రయోజనాన్ని అందజేస్తుందని గడ్కరీ వెల్లడించారు. ఈ క్రమంలో సబ్సిడీ డిమాండ్ ఇకపై సమర్థించ బడదని కేంద్ర మంత్రి భావించారు.

ఈ నేపథ్యంలో క్లీన్ ఎనర్జీ వైపు విస్తృతంగా మారాలని గడ్కరీ సూచించారు. కానీ దేశంలో ఇంకా పెట్రోలు, డీజిల్‌పై భారతదేశం ఆధారపడటం ఒక ఆందోళనకర విషయమని గడ్కనీ అన్నారు. కానీ పెట్రోల్, డీజిల్ వాహనాలపై అదనపు పన్నులు విధించే అంశాన్ని ఆయన తిరస్కరించారు. ప్రజా రవాణాలో ఇల విస్తరణ గురించి ప్రస్తావించారు. పెట్రోల్ డీజిల్ వాహనాలపై ఆధారపడటం వల్ల కాలుష్య స్థాయిలు పెరుగుతున్నాయని, ఇలాంటి క్రమంలో ఎలక్ట్రిక్ బస్సులు కీలక పాత్ర పోషిస్తాయని నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రభుత్వం ఇయూ కంపెనీలకు ఇచ్చే సబ్సిడీ కారణంగా కొనుగోలుదారులు కొంత ప్రయోజనం పొందుతున్నారు.

# ప్రపంచగతిని మార్చేస్తున్న సరికొత్త ఆవిష్కరణలు

(మొదటి పేజి (తరువాయి)



నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది.

అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం అని పిలుపునిచ్చారు. రైల్ ఇంజిన్, టీవి, కెమెరాతో ప్రారంభమైన ఆవిష్కరణలు ఇప్పుడు ఆర్టిఫీషియల్ దాకా వచ్చాయిన సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్రమంగా టెక్నాలజీ పెరుగుతోంది.. ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే ఎఐ కి మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెట్టబడి దారులను ఆహ్వానిస్తున్నామనం ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎఐ రంగంలో పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు.

కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏఐ రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను ఇందులో పేర్కొన్నారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఏఐలో పూర్తిగా పట్టు సాధించబో తున్నామన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏటా అభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళు _న్నామన్నారు. డీప్‌ఫేక్ లాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించు కుంటామని చెప్పారు. ప్రపంచస్థాయి యూనివర్సి టీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌కు సమీపంలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు అయ్యేలా చూస్తామని వివరించారు. రాబోయే రెండు రోజులు హెచ్ఐసీసీ వేదికగా ఏఐ పైనా చర్చలు, సెమినార్లు ఉంటాయని శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ డెవలప్‌మెంట్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని శ్రీధర్ బాబు అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగం చేయొద్దని ఆయన సూచించారు.

హైదరాబాద్ లో 200 ఎకరాలు కేటాయించి ఏఐ సిటీని ఏర్పాటు చేస్తాము. రాబోయే మూడేళ్లల్లో గ్లోబల్ ఏఐ హబ్ గా హైదరాబాద్ అవతరిస్తుందని మంత్రి అన్నారు.

ఏఐ పెట్టుబడ ులకు ఇండియా గమ్యస్థానంగా ఉందని ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ రంగంలో నిపుణులైన 2వేల మంది ఏఐ నిపుణులు సదస్సుకు వచ్చారు.

# ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానికత

(మొదటి పేజి (తరువాయి)

ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.మయూర్‌రెడ్డి, డి.వి.సీతారాంమూర్తి తదితరులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల సవరణ వల్ల స్థానికులకే ఎక్కువ నష్టం వాటిల్లు తోందన్నారు. ఇతర రాష్ట్రాల వారితోపాటు భారతీయ మూలాలున్న ప్రవాసులు ఇక్కడ 4 ఏళ్లు చదువుకుంటే 85 శాతం స్థానిక కోటా కింద అవకాశం దక్కించుకుంటారన్నారు. దీనివల్ల తెలంగాణలో పుట్టిపెరిగిన వారికి నష్టం వాటిల్లుతుందన్నారు. స్థానిక కోటా ఇక్కడ నివాసం ఉన్నవాళ్లకే అడుగుత ున్నామని, చదువుకున్నవారు అన్న దానిపై అడగడం లేదన్నారు. ఉద్యోగులు బదిలీ కావడం వంటి పరిస్థితుల్లోనూ.. అలాగే మెరుగైన విద్య కోసం.. ఇంటర్ మరో రాష్ట్రంలో చదువుకున్న తెలంగాణ విద్యార్థి స్థానికుడు కాదనడం సరికాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగుల పిల్లలకు అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం.. ప్రైవేటు ఉద్యోగుల పిల్లలకు అవకాశం నిరాకరించడం వివక్ష చూపడమేనన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతోనే ఈ జీవో తీసుకువచ్చినట్లు తెలిపారు.

నిబంధనలు తీసుకువచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి ఇరుపక్షాల వారు పలు సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులను ధర్మాసనం ముందుంచారు. వాదనలను విన్న ధర్మాసనం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజే జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం తీర్పును వెలువరించింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం పేర్కొంది. స్థానికత నిర్ధారణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని సచించింది. కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని స్పష్టం చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో స్థానికత జీవోకు సంబంధించిన అంశంపై హైకోర్టులో విచారణ జరిగింది.

వైద్యారో గ్యశాఖ జారీ చేసిన జీవోను పలువురు విద్యార్థులు సవాల్ చేశారు. నీట్ ప్రవేశ పరీక్ష రాసే సమయానికి విద్యార్థి వరుసగా నాలుగేళ్లు చదివితేనే స్థానికుడిగా పరిగణించాలంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పేర్కొంది. సర్కారు జారీ చేసిన ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కి విరుద్ధమని పిటిషన్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిం చారు. ఆయా పిటిషన్లపై వాదనలు విన్న సీజే ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది.

# విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

(మొదటి పేజి (తరువాయి)

విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయం తీసుకుని జీవో విడుదల చేశామని అన్నారు. రాష్ట్రంలో వరదల సమస్యల వల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని తెలిపారు. 'ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా మన విద్యావ్యవస్థ లేదు. మన రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నాం. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ పడేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సమాజాన్ని సన్మార్గంలో పెట్టడంలో గురువులది కీలకపాత్ర. అదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో ఆదర్శమైన గురువులు ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను మన గురువులు చక్కగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని పైలట్ ప్రాజె క్టుగా అమలు చేసినప్పుడు చక్కగా సహకరించారు. గురువులు ఎంత గొప్ప వాళ్ళైతే సమాజం కూడా అంత గొప్పగా మారు తుందని భట్టి విక్ర మార్క అన్నారు. విద్యను, గురువులను గౌరవించేది కాంగ్రెస్ మాత్రమేనని వ్యాఖ్యానిం చారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే ఉపాధ్యాయులకు పదో న్నతులు కల్పించామన్నారు. మరో 6 వేల ఉపాధ్యాయ పోస్టుల కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 27, 862 విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. ఇవాల్టి నుండే అమలు చేస్తున్నామని.. జీవో కూడా విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉందని.. అన్నారు. ఈ సందర్భంగా




ఎమ్మెల్సీ కోదండరాంను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు , ఎమ్మెల్యేలు కోదండరాం, నర్సిరెడ్డి, రఘోత్తం రెడ్డి , ఏవీఎన్ రెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్ లింబాద్రి, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్లు దేవసేన , శృతి ఓజా , ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు-మన బడి'ని మధ్యలోనే ఆపేసిన ప్రభుత్వం

సిద్దిపేట,సెప్టెంబర్5: విద్యావ్యవస్థ ఇంకా బలోపేతం కావాలని సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీసీ భవనంలో గురుపూజోత్సవం సందర్భంగా గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా గురు పుజోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు.

ఈ గురువులు అందరికీ గురు పుజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులకు సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని వివరించారు. ఎవరికి దొరకని గౌరవం ఓక ఉపాధ్యాయునికి దొరుకు తుందని అన్నారు. సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు ఎప్పుడు సిద్దిపేట గౌరవాన్ని కాపాడారని చెప్పారు. రాష్ట్రంలో పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేటను రెండో స్థానంలో ఉపాధ్యాయులు నిలిపారని ప్రశంసించారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ట్రిబుల్ ఐటీలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ తెలంగాణలోని పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టారని చెప్పారు. 'మన ఊరు – మన బడి' పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా ప్రారంభించామని తెలిపారు. మన ఊరు – మన బడి' పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిందని ఆరోపణలు చేశారు.రాష్ట్రంలో 1700 ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం మూతప డ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులకు సంబంధిం చిన నాలుగు డీఏలు ఇంకా పెండింగ్?లో ఉన్నామని..వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత కరెంటు లేదని.

. స్కవెంజరు?లు లేరని చెప్పారు. విద్యా వలంటీర్లు, ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని తీసివేతలు, ఏరివేతలు కోతలు పెడుతున్నారని ఆరోపణలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యా నిలయంగా సిద్దిపేటను మార్చుకున్నామని చెప్పారు. సిద్దిపేట ప్రజలు అన్ని చదువులు చదవాలని అన్ని కోర్సులు అందుబాటులోకి తెచ్చినట్లు హరీష్ రావు వెల్లడించారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
శుక్రవారం 6 సెప్టెంబర్2024

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని

### మెట్ పల్లి డిఎస్పి ఉమామహేశ్వరరావు



జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 05 :
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ పోలీస్ స్టేషన్, ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకులతో సమన్వయ సదస్సు నిర్వహించారు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకో వాలని డిఎస్పి ఉమామహేశ్వరరావు, సిఐ నిరంజన్ రెడ్డి ఎస్ఐ చిరంజీవి, రాజు లు వినాయక ఉత్సవ కమిటీ సభ్యు లతో సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం డీజే లకు అనుమతి లేదన్నారు అలాగే రాత్రి పదిగంట లకు మైకు సెట్లు బందు చేయాలని తెలిపారు ప్రతి గణేష్ మండపానికి పోలీస్ శాఖ అనుమతి కోసం ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల ని కోరారు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఊరేగింపులలో డీజే కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని ఇట్టి ఉత్తర్వులను అధిగమించిన వారికి చట్టపరమైన చర్య లు తీసుకోబడును తెలిపారు భక్తి పరవశంతో వినాయక నవరాత్రులు జరుపుకోవాలని మత్తు పదార్థాలు మద్యం పూర్తిగా నిషేధించి భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులు జరిపి యావత్ తెలంగాణ లో మెట్ పల్లి పట్టణానికి ఉత్తమ పట్ట ణంగా ఖ్యాతి తేవాలని కోరారు కార్యక్రమానికి మెట్ పల్లి గణేష్ మండపాల నిర్వాహకులు సంఘ సేవకులు తదితరు లు పాల్గొన్నారు


## బొమ్మనపల్లి పాఠశాలలో టీచర్స్ డేవిద్యార్థులే టీచర్స్



భద్రాద్రి కొత్తగూడెం (మన వెలుగు) సెప్టెంబర్ 5:
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. బొమ్మనపల్లి హైస్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మంగీలాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాంప్లెక్స్ హెచ్.ఎం.మంగీలాల్ ను, బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం. ఎం.జ్యోతిరాణి, అసిస్టెంట్ టీచర్ జె.పద్మ, అంగన్వాడీ టీచర్లు జి.విజయలక్ష్మి, విజయ, సిఆర్పి అబ్బయ్య లను ఘనంగా సన్మానించారు. టీచర్స్ డే కేక్ కట్ చేశారు. విద్యార్థులు టీచర్స్ గా భోధన చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ పొగాకు లక్ష్మి, ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ఎస్ జి ఎఫ్ ఉమెన్స్ గిల్డ్ సంయుక్త కార్యదర్శి నసీం పాషా, గ్రామ దీపిక రోజా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లకు గొడుగులు బహుమానం

### – విద్యార్థుల ఆలోచనకు ప్రశంసలు



భద్రాద్రి కొత్తగూడెం (మన వెలుగు) సెప్టెంబర్ 05 :
కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని రామవరంలో ఉన్న మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మా టీచర్లు వర్షంలో తడిసి జ్వరాలు తెచ్చుకోవద్దని పేర్కొంటూ వారికి గొడుగులు బహుమానం ఇచ్చారు. విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆలోచన చేసి గొడుగులు ఇవ్వడం అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు టీచర్ల పాత్ర పోషించారు. వివిధ భాషల్లో గురువులు గొప్పదనం గురించి ప్రసంగాలు చేశారు. వారి గొప్పతనాన్ని కీర్తిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్, హెచ్.ఎం. పర్వీన్ సుల్తానా, టీచర్లు శిరిషా, నుసరత్, నీలా, ప్రసన్న, ఖాజా, సరస్వతి, అనితా, జేషిషా, కృష్ణ కూమారి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకోవాలి

## ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్



భద్రాద్రి కొత్తగూడెం (మన వెలుగు) సెప్టెంబర్ 05 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నిమ్మల గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా గురువారం నిమ్మలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో ఘనంగా వేడుకలను జరిపారు. తొలుత అతిధులందరూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు. నాలుగవ తరగతికి చెందిన ఆరాధ్య, నాలుగవ తరగతికి చెందిన ఏకలవ్య పాఠాన్ని బోధించి గురుకులంలో చదువుతున్న పాఠశాల పూర్వ విద్యార్థి బండి సిద్ధార్థ ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఔన్నత్యాన్ని ఉపన్యసించి అందరినీ అబ్బురపరిచారు. అనంతరం ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నిజమైన ఉపాధ్యాయుడికి నిర్వచనాన్ని ఇస్తూ ఉపాధ్యాయుడు తరగతి గది బోధనకే పరిమితం కాకుండా సమాజాన్ని కూడా ప్రభావితం చేయాలని సమాజాన్ని చైతన్యపరచాలని సామాజిక అభివృద్ధిలో భాగస్వామి కావాలని అతడే నిజమైన ఉపాధ్యాయుడని నిర్వచించిన విధంగా తాను కూడా అటు పాఠశాల అభివృద్ధికి ఇటు సామాజిక అభివృద్ధికి కూడా పాటుపడుతూ, ప్రపంచంలోనే అత్యున్నత విద్యావంతుడైన, భారత రాజ్యాంగ సృష్టికర్త భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని స్ఫూర్తిగా తీసుకొని పే బ్యాక్ టు ది సొసైటీకి కట్టుబడి ముందుకు పోతున్నట్లు పేర్కొన్నారు.గౌరవ అతిథులుగా విచ్చేసిన సుజాతనగర్ సొసైటీ డైరెక్టర్ అమృత రావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శాంతకుమారి, ఆర్.ఎం.పి వైద్యులు శ్రీనివాసరావు, సభకు అధ్యక్షత వహించిన బండి రమేష్ లు మాట్లాడుతూ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లాంటి గొప్ప వ్యక్తి ప్రధానోపాధ్యాయులు గా షఫీ అహ్మద్ లాంటి మంచి ఉపాధ్యాయులు తమ ఊరి బడిలో పనిచేయడం గర్వకారణమని వారి బోధనలోనూ పర్యవేక్షణలోనూ విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి దిశగా సాగుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పాటల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన సొంత సౌజన్యంతో దాదాపు 2 వేల రూపాయల విలువైన బహుమతులను విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, సహ ఉపాధ్యాయులు ఎండి షఫీ అహ్మద్, సుజాతనగర్ సొసైటీ డైరెక్టర్ అమృత రావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శాంతకుమారి, అభ్యుదయ వాది వైద్యులు శ్రీనివాసరావు, ఏఎన్ఎం సునీత, ఈ కార్యక్రమరూపశిల్పి సభా అధ్యక్షత వహించిన అభ్యుదయ వాది , అంబేద్కర్ వాది, సామాజిక తత్వవేత్త బండి రమేష్, రజిత, లావణ్య నరేందర్, హుస్సేన్, గ్రామ పెద్దలు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరుగురు మావోయిస్టులు మృతి

## మన్యంలో మోగిన తుపాకీ తూటాలు - కరకగూడెం మండలంలో ఘటన



భద్రాద్రి కొత్తగూడెం (మన వెలుగు) సెప్టెంబర్ 05 :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శివారి పరిధిలో భారీ మన్యంలో మరోసారి తుపాకీల తూటాలు మోగాయి. కొన్ని సంవత్స రాలు తర్వాత కాల్పులు చోటు చేసుకోవడంతో మన్యం వాసులు భయ భ్రాంతులకు గురయ్యారు. మావోయిస్టు లకు పోలీసులకు ఎదురు కాల్పులు జరిగిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని రఘునాథ పాలెం అటవీ ప్రాంతంలోని తిరుమల దోనెల గుట్ట ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధిం చిన వివరాలు ఇలా ఉన్నాయి. కరకగూడెం మం డలం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరి స్తున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం మేరకు, గ్రే హౌండ్స్ పోలీసులు అడవులను విస్తృతంగా జల్లెడు పడుతున్నారు. ఈ కోణం లోని రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో తిరుమల దోనెల అటవీ ప్రాంతంలో మావో యిస్టు తారస పడ్డారు. ఈ క్రమం లోనే పోలీసులకు, మావోయిస్టు లకు భీకరంగా ఎదురు కాల్పులు దాదపు పావుగంట సేపు జరిగాయి. కొద్దిసేపటికి కాల్పులు మావోయిస్టు ల నుండి ఆగిపోవడంతో పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడంతో పాటు, ఇద్దరు పోలీసు లకు గాయలైనట్లు పోలీసులు వివరాలు వెల్లడించారు. గాయాలైన పోలీసులను భద్రాచలం ఏరియా అసుపత్రికి వైద్యం కోసం 108 ద్వారా తర లించారు. ఈ ఎదురు ఎన్ కౌంటర్ లో మణుగూరు ఏరియా కమిటి లచ్చన్న దళంగా పోలీసులు గుర్తించారు. మావోయిస్టు అగ్రనేత లచ్చన్న మృతి చెందినట్లు సమాచారం. ఘటన ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇంకా ఎంత మంది మావోయిస్టు లు ఈ కాల్పుల్లో పాల్గొన్ని ఉంటారని వారి కోసం అన్వేషణ చేపట్టారు. ఈ కాల్పుల్లో జరగడంతో పినపాక, కరకగూడెం మండలంలో పోలీసులు అణువు, అణువున గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కాల్పులుపై పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

# మరమ్మతులు వద్దు..నూతన భవనాలకు అంచనాలు సిద్ధం చేయండి

## • ఆర్టీసీ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి • కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండును సందర్శించిన ఎమ్మెల్యే



భద్రాద్రి కొత్తగూడెం (మన వెలుగు) సెప్టెంబర్ 05 :ఆర్టీసీ బస్టాండు భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని దీన్ని మరమ్మత్తులు చేయడంవల్ల సమస్య పునరావృతం అయ్యేపరిస్థితులు నెలకొటా యని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండును గురువారం అయన సందర్శిం చారు. శిథిలా వస్థకు చేరిన భవన సముదాయంపై ఆందో ళన వ్యక్తం చేశారు. అందుతున్న సేవలు, బస్టాండు ఆవరణలో సౌకర్యాలను ప్రయాణికులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లా డుతూ యాభై ఏండ్లక్రితం నిర్మించిన నిర్మా ణం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నా యని అన్నారు. తాత్కాలిక మరమ్మత్తులతో నిధులు వృధాకావడం మినహా ఎలాంటి ప్రయోజనం ఉండ దన్నారు. అక్కడి నుంచే ఆర్టీసీ సీఈ, ఈఈతో ఫోన్లో మాట్లాడి నూతన భవనాల నిర్మాణాన్ని ప్రతిపాదనలు అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వంతో, ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి నూతన భవనాల నిర్మాణంకోసం వత్తిడి తెస్తానని తెలిపారు. బస్టాండు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. బ్రీత్ ఎనలైజర్ మిషన్ల లోపాలవల్ల సిబ్బంది ఇబ్బందులకు గురి అవుతున్నారని దీన్ని తక్షణ రద్దు చేయాలనీ కార్మికులను క్రమబద్దీకరించి, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సర్వీసులను పెంచాలని తదితర అంశాలపై ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు. సర్వీసులను పెంచాలని, గతంలో రద్దైన హైదరాబాద్ సర్వీసులను పునరుద్దరించాలని, కొత్తగూడెం డిపోకు మంజూరై ఇతర ప్రాంతాలకు మళ్లించిన లహరి, కొత్త డీలక్స్ బస్సులను, డిప్యూటేషన్ పై పంపిన సిబ్బందిని తిరిగి రప్పిం చాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఆర్ఏం సరిరాం, డిఎమ్ దేవేందర్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, సిపిఐ నాయకులు మాచర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక
శుక్రవారం 6 సెప్టెంబర్2024

# ఉట్నూరులో ఫ్లాగ్ మార్చ్



ఆదిలాబాద్ ( మన వెలుగు ) సెప్టెంబర్ 05:
ప్రశాంతత నెలకొల్పేందుకు, ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు నందు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం , జిల్లా సాయుధ పోలీసులు , స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా గురువారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోన అవకుం డా ఉండాలని తెలియజేశారు. జిల్లా నందు ఎలాంటి బంద్ లేదని, బంద్ ఉందంటూ ప్రచారం చేసిన, బంద్ నిర్వహిం చాలని సంచరించిన వారిపై చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియా నందు దుష్ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

# పోషణ మహోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఆదిలాబాద్ ( మన వెలుగు ) సెప్టెంబర్ 05 :
సెప్టెంబర్ మాసం ఆరోగ్య రక్షణే లక్ష్యం మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రతీ సంవత్సరం పోషణ్ అభియాన్ పేరిట మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతున్న ది ,ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ మొదటి వారం నుంచి చివరి వారం వరకు కార్యక్రమాలు కొనసాగించడం జరుగుతుంది. 5 రోజు గురువారం అదిలాబాద్ జిల్లా బేల మండలం చిన్నుగుడ గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ మహోత్సవాలలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు జిల్లా పాల నాధి కారి కి పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ... అంగన్వాడి లో ఇస్తున్న పౌష్టికాహారం, బాలమృతమ్, మధ్యహ్నం భోజనం ప్రతీ రోజు తీసుకోవాలని, తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఇక్కడ ఇస్తున్న ఐరన్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని, మంచి ఆహారం తీసుకోవాలని హితువు పలికారు. జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ మొదటి వారం నుంచి చివరి వారం వరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, చిన్నారుల ఆరోగ్య పరిస్థి తులపై అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పిస్తారని, వివిధ శాఖల సమన్వయంతో పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, గర్భిణుల నమోదు తోపాటు పరీక్షలు, వైద్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.
మాతా, శిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు. పోషకాహారం తీసుకునేందుకు శుభ్రత పాటించడం, ఇతర విద్యార్థులను ప్రోత్సహించడం, ఉదయం ప్రార్థనలో పోషకాహారంపై రోజువారి సందేశాలు ఇవ్వడం, వ్యాసరచన పోటీలు, చేతుల శుభ్రత పై ప్రదర్శనలు చేయించడం, పోషకాహారం లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి బాలామృతం అందించడం, గృహ సందర్శన కార్యక్రమాలలో ఇంటింటికి వెళ్లి పోషకాహారం లోపం ఉన్న చిన్నారులను గుర్తించి, ఇంట్లోనే పోషణ స్థాయి మెరుగు పర్చేందుకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఏఎన్ఎంల సలహా మేరకు దవాఖానలో చేర్పించాలని అన్నారు.సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ మాసోత్సవాలు షెడ్యూల్ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాల నిర్వహించాలని, అన్ని శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పోషకాహార విలువలపై ప్రజల్లో చైతన్యం కలిగించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆన్నారు. ఇందులో బేల తాసిల్దార్ వామన్ రావు, , ఎంపిడిఓ,మహేందర్, సీడీపీఓ, సూపర్వైజర్, అంగన్వాడి టీచర్, ఏఎన్ఎమ్, ఆశ వర్కర్, తదితరులు ఉన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

**- విషజ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి**
**- సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవి కుమార్**




ఆదిలాబాద్ ( మన వెలుగు ) సెప్టెంబర్ 05 :
ఆదిలాబాద్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి రవికుమార్ ముఖ్యాథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆదిలాబాద్ జిల్లాలో 22ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 53 డాక్టర్ పోస్టులు ఉండాల్సి ఉండగా 34 మాత్రమే ఉన్నాయి 19 ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. ప్రొఫెసర్, మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 83 ఉన్నాయి.కానీ 49 మంది మాత్రమే ఉన్నారు.మిగితావి కాలిగా ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో 8 విగాలకు 36 పోస్టులు ఉండగా 9 మందే ఉన్నారు.మిగిలిన పోస్టులు కాలిగా ఉన్నాయి. రిమ్స్ హాస్పిటల్ లో 120 నర్స్ పోస్టులు కాలిగా ఉన్నాయి. పెషేంట్లకు మందులు లేక బయట మెడికల్ షాపులో కొనుక్కోవాల్సి వస్తున్నది. పేదలకు ఇది భారంగా ఉంది. పత్తి సోయా పంటలకు భారీ వర్షాల వాళ్ళ జరిగిన నష్టనికి ఎకరానికి 30 వేల రూపాయలనుచెల్లించాలి. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలి. సిపిఎం పార్టీగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్,లంక రాఘవులు, పూసం సచిన్,అన్నమొల్ల కిరణ్,పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రే,జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# మెట్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు

**ఉపాధ్యాయులను సన్మానించి ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులు**



జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 05 : జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జెట్టి లింగం, అడ్లూరి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉపాద్యాయులు చెప్పిన పాఠాలను విని మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి విద్యార్థులు ఎదగాలని. ఇక్కడ చదువున్న పూర్వ విద్యార్థులంతా మంచి స్థాయిలో ఉన్నారని మీరంతా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ స్కూల్ పురాతన స్కూల్ కావడంతో వర్షాలు పడడంతో స్కూల్ లోకి నీరు చేరుతుందని, పైకి కప్పునుండి పెచ్చులు రాలుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారని, జువ్వాడి నర్సింగరావు దృష్టికి తీసుకువెళ్లి ఈ స్కూల్ లు బాగు చేయిస్తానని జెట్టి లింగం తెలిపారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ...ఈ పాఠశాల ఎంతోగొప్ప చరిత్ర పాటశాలని, ఇందుకు చదువున్న వారంతా లాయర్ లు, డాక్టర్ లు,ఎంతో మంది ఆఫీసర్లు అయ్యారని అలాంటి చరిత్ర గలిగిన పాఠశాలని, ఈ పాఠశాల పురాతన పాఠశాల కావడంతో వర్షం పడినప్పుడు పాఠశాలలోకి నీరు చేరుతుందని పిల్లలు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, పై నుండి పెచ్చులు కింద పడుతున్నాయని ప్రభుత్వం స్పందించి ఇలాంటి చరిత్ర గలిగిన పాఠశాలకు నూతన బిల్డింగ్ కట్టించాలని రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం స్కూల్ టీచర్ అనుజా మాట్లాడుతూ...ఈ పాఠశాలలో చదువుకున్న వాళ్లంతా గొప్ప గొప్ప వాళ్ళు అయ్యారని అలాంటి పాఠశాలలో చదువుకోవడం మన అదృష్టమని ఈ పాఠశాలలో చదువుతున్న మీరంతా గొప్ప వాళ్ళు కావాలని కోరుతున్నానని ఆమె తెలిపారు.అనంతరం విద్యార్థిని విద్యార్థులు టీచర్లకు పుష్పగుచ్చాం అందించి శాలువలతో సన్మానించి ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెట్టి లింగం, అల్లూరి మహేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ విజయ్, టీచర్లు అనుజా, బి.సరిత, వి.సరిత, ఆనంద్ కుమార్, శ్రీకాంత్, ఇలియస్, మధు చందర్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్?కు పెమ్మసాని ఫౌండేషన్ విరాళం



అమరావతి: సీఎం రిలీఫ్ ఫండ్?కు గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ,పెమ్మసాని రవిశంకర్ వారి ఫౌండేషన్ ద్వారా రూ.కోటి విరాళం అందజేశారు. సీఎం చంద్రబాబుకు పెమ్మసాని చెక్కును అందజేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న బాధితుల సహాయార్థం పెమ్మసాని ఫౌండేషన్ ముందుకు వచ్చింది. పెమ్మసాని ఫౌండేషన్ తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రూ. కోటి చెక్కును అందజేశారు.లైన్?మెన్ కోటేశ్వరావు కుటుంబానికి ప్రభుత్వవ సాయం
ఎన్టీఆర్ జిల్లా( ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నంలో వరదల కారణంగా విధి నిర్వహణలో మృతి చెందిన లైన్ మెన్ కోటేశ్వరావు కుటుంబానికి రూ. 32 లక్షల ఎక్స్ గ్రేషియాను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది బాధితుడి భార్యకు ఉద్యోగం, పిల్లలకు డిగ్రీ పట్టభద్రులు అయ్యేంతవరకు సంవత్సరానికి ఒక్కొక్కరికిరూ. 25 వేల రూపాయలు ఆర్థిక
సాయం ప్రభుత్వం ప్రకటించింది. ఎక్స్?గ్రేషియా చెక్కును, ప్రభుత్వ నియామక పత్రాన్ని , పిల్లల చదువుకు సంబంధించిన ఆర్థిక సహాయా ఉత్తర్వులను బాధ్యత కుటుంబానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అందజేశారు.

# ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతులు లేవు

**అనుమతులు లేకుండా సభలు ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యల**



ఆదిలాబాద్ ( మన వెలుగు ) సెప్టెంబర్ 05 :
జైనూర్ సంఘటన దృష్ట్యా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. అనుమతులు లేకుండా గుమిగూడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేశారు. అదిలాబాద్ జిల్లా లోని అన్ని మండలాల నందు 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని తెలిపారు

అన్ని మండలాలలో బంద్ ఉందంటూ ప్రచారం చేసిన, బంద్ చేయడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ప్రస్తుతం జైనూరు మండలం ప్రశాంత వాతావరణంలో ఉందని తెలిపారు. జైనూరు సంఘటన నందు కారకులపై కేసులు నమోదు చేయబడం జరిగిందని, దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలెవరు గుంపులు గుంపులుగా తిరగడం, అనవసరంగా బయటకు రావడం చేయరాదని తెలిపారు. ఉద్రిక్తతలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తగా చెక్పోస్టులను ఏర్పాటు చేసి ఇతరులను జైనూర్ లోనికి అనుమతించడం జరగదని తెలిపారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులు నమ్మవద్దని సూచించారు. సోషల్ మీడియా నందు వదంతులను వ్యాప్తి చేసే వారిపై, మరియు గ్రూప్ అడ్మిన్ లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.